RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 105 | పేజీలు : 4 | శనివారం 17 అక్టోబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



అమెరికా మంత్రి పర్యటన:

జైశంకర్‌పై రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం



కేరళ మాజీ సీఎం విజయన్ ఇంటికి నోటీసులు అతికించిన ఈడీ

- మనీలాండరింగ్ కేసులో పినరయి విజయన్‌కు ఈడీ సమన్లు
- అక్టోబర్ 23న కొచ్చిలో విచారణకు హాజరుకావాలని ఆదేశం
- కుమార్తె కంపెనీకి అక్రమ చెల్లింపుల కేసులో విచారణ

మహిళలకు, యువతకు ప్రాధాన్యత

- టీడీపీ రెండో జాబితా విడుదల..
- మచిలీపట్నం మేయర్ అభ్యర్థి ఖరారు
- ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల కోసం టీడీపీ నుంచి మరో జాబితా
- మొత్తం 22 మంది అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటించిన పార్టీ
- మచిలీపట్నం మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అబిదా పేరు ఖరారు
- జాబితాలో 21 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల చైర్‌పర్సన్ అభ్యర్థులు



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో టీడీపీ తన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా 22 మందితో కూడిన రెండో జాబితాను శనివారం అధికారికంగా విడుదల చేసింది. మచిలీపట్నం కార్పొరేషన్ మేయర్ అభ్యర్థితో పాటు 21 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చైర్‌పర్సన్ అభ్యర్థుల పేర్లను ఈ జాబితాలో ఖరారు చేసింది. పార్టీ జాతీయ కార్యాలయం నుంచి ఈ ప్రకటన వెలువడింది. ఇటీవలే 36 మందితో తొలి జాబితాను ప్రకటించిన టీడీపీ, తాజాగా రెండో జాబితాను విడుదల చేయడంతో ఎన్నికల బరిలో దూకుడు పెంచినట్లయింది. ఈ జాబితాలో కీలకమైన మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అబిదాను ఎంపిక - మిగతా3లో

అన్ని చోట్ల టీడీపీ గూండాలు బరితెగిస్తున్నారు

- చంద్రబాబు ఆదేశాలతోనే పోలీసులు కాల్పులు జరిపారు: సజ్జల
- నామినేషన్ల ప్రక్రియలో అరాచకాలకు పాల్పడుతున్నారు
- ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే తనకు అసలు ఎన్నికలు ఎందుకు అనిపిస్తోంది
- తమను నైతికంగా ఎదుర్కోలేక చంద్రబాబు ఈ దాడులు చేయిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి



తాడేపల్లి

నామినేషన్ల ప్రక్రియలో అరాచకాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. స్వేచ్ఛగా నామినేషన్లు వేసే వాతావరణం లేదని తెలిపారు. అన్ని చోట్ల టీడీపీ గూండాలు బరితెగిస్తున్నారని, ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే తనకు అసలు ఎన్నికలు ఎందుకు అనిపిస్తోందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అరాచకాలపై తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి మాట్లాడిన సజ్జల.. తమను నైతికంగా ఎదుర్కోలేక చంద్రబాబు ఈ దాడులు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఆదేశాలతోనే పోలీసులు కాల్పులు జరిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులే దాడులు చేస్తున్నారని, దీనికి ఎన్నికలు ఎందుకుని ప్రశ్నించారు. టీడీపీకి ఎన్నికలంటే భయమని తెలిపారు. ఏపీలో భయానక పరిస్థితులు కనిపిస్తున్నాయని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. కూటమి - మిగతా3లో



తిరువూరు కూటమిలో చిచ్చు

- జనసేన అభ్యర్థికి పోటీగా అభ్యర్థిని ప్రకటించిన ఎమ్మెల్యే కొలికపూడి..!
- పురపాలక ఎన్నికల్లో తిరువూరు చైర్మన్ సీటుపై ఎన్డీయే కూటమిలో రగడ
- పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించడంపై టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి అసంతృప్తి
- జనసేన అభ్యర్థికి పోటీగా తమ అభ్యర్థిని నిలబెడుతున్నట్లు ప్రకటన



సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు షరతులతో బెయిల్

- నిరసన యాత్రకు ముందు దీప్కేను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- నేడు బెయిల్ ఇచ్చిన మందిర్ మార్గ్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు
- రూ. 50,000 వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశం
- ఏడాది పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని షరతు
- కన్నాట్ ప్లేస్‌లో నిరసన యాత్రకు అనుమతి నిరాకరించిన పోలీసులు

బీజేపీకి నచ్చని ఓట్లను తొలగిస్తున్నారు



- 'సర్' ప్రక్రియపై మహేశ్ కుమార్ గౌడ్
- 'సర్' ప్రక్రియలో లోపాలున్నాయన్న టీపీసీసీ చీఫ్
- ఓటర్ల జాబితా సవరణలో నిబంధనలు పాటించడం లేదని విమర్శలు
- వ్యక్తి మరణిస్తే ఓటు తొలగించాలని, వేరే ప్రాంతానికి మారితే బదిలీ చేయాలని సూచన
- ఎన్నికల సంఘం స్వతంత్రతపై ఆందోళన
- సీఈసీ ఎంపిక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తొలగించారని ప్రశ్న

హైదరాబాద్

ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తీవ్ర లోపాలున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఈ ప్రక్రియలో పారదర్శకత లేదని, తనకు కూడా నోటీసు వచ్చిందని వెల్లడించారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఓటర్ల జాబితా సవరణలో నిబంధనలను సరిగా పాటించడం లేదని విమర్శించారు. ఓ వ్యక్తి మరణిస్తే వారి ఓటును తొలగించాలని, వేరే ప్రాంతానికి మారితే ఓటును బదిలీ చేయాలని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. అయితే, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి నచ్చని ఓట్లను ఏకపక్షంగా తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ప్రయోగిస్తున్న బీజేపీ.. ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని కూడా తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఎన్నికల సంఘం - మిగతా3లో

విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలి




- ఎల్ నినో ఎఫెక్ట్: కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి
- ఎల్ నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన
- రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- గతంలో చలిగా ఉండే అక్టోబర్‌లోనూ ఇప్పుడు ఎండల తీవ్రత
- వాతావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న భట్టి

హైదరాబాద్

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణం గా సహజ వనరులను బాధ్యతాయు తంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతై నా ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ - మిగతా3లో

దళితులు, గరిజనులు, మైనార్టీలే 'సర్' అసలైన లక్ష్యం

- మోదీ ప్రభుత్వం 13 కోట్ల ఓట్లను తొలగించిందన్న మధు యాష్కీ
- 'సర్' ప్రక్రియ ద్వారా ఈ తొలగింపు జరిగిందని వెల్లడి
- రాజ్యాంగ పరిరక్షణ కోసమే తమ పోరాటమని స్పష్టీకరణ



తెలంగాణకు

నేటి నుంచి వర్ష సూచన



- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక
- ఉత్తర తమిళనాడు తీరంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- హైదరాబాద్ సహా అనేక జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ

హైదరాబాద్

తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించిం ది. నేడు, రేపు, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని - మిగతా3లో

సీమ వార్త సాయంకాలం

శనివారం 17 అక్టోబర్ 2026

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

బయోడేటాతో...నిమ్మల శ్రీధర్ "బరిలోకి సిద్ధం"...!!

ఎంపీటీసీ అభ్యర్థిగా...టిడిపి ఆఫీస్‌లో కన్వీనర్ కు బయట అందజేసిన నిమ్మల శ్రీధర్.



గోరంట్ల అక్టోబర్ 17 సీమ వార్త సాయంత్రం. స్థానిక సార్వత్రిక ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీకి నేను సిద్ధంగా ఉన్నానని తమ బయోడేటాను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నిమ్మల శ్రీధర్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరికి అందజేశారు. గోరంట్ల మండలం ఎంపీపీ స్థానం బీసీలకు కేటాయించిన నేపథ్యంలో టిడిపి సీనియర్ నేత నిమ్మల శ్రీధర్ ఎంపీటీసీ అభ్యర్థిగా నేను పోటీ చేయబోతున్నానని పార్టీ అధిష్టానానికి బయోడేటా ఇవ్వడం చర్చనీయంశాంగా మారింది.

ఓటమి భయంతోనే దాడులు..!!

.....జగన్ పై మంత్రి సవిత ఫైర్.

....వివేకా హత్య కేసులో వేళ్లన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే.

.....ఈడీ దాడులతో జగన్ లో భయాందోళనలు.

.....పక్క రాష్ట్రాల గూండాలతో టీడీపీ శ్రేణులపై గొడ్డలి పార్టీ దాడులు.

.....వీధి రౌడీలా పెట్రేగిన ఎంపీ మిధున్ రెడ్డి.

.....గొడ్డలి పార్టీ దౌర్జాన్యాలపై ఈసీకి ఫిర్యాదు చేశాం.

.....వైసీపీ పని క్లోజ్....పులివెందుల సహా స్థానిక ఎన్నికల్లో కూటమి క్లీన్ స్వీప్

పెనుగొండలోని మంత్రి కార్యాలయంలో స్పష్టం చేసిన...మంత్రి సవిత



పెనుకొండ అక్టోబర్ 17 సీమ వార్త సాయంత్రం.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసి జగన్, గొడ్డలి పార్టీ నాయకులు దాడులకు తెగబడుతున్నారు. పక్కరాష్ట్రాల నుంచి గూండాలను తీసుకొచ్చి, టీడీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులకు తెగబడుతున్నారు. ఎంపీ మిధున్ రెడ్డి వీధి రౌడీలా వ్యవహరించారు. గొడ్డలి పార్టీ నాయకులు ఎన్ని బెదిరింపులకు, దాడులకు పాల్పడినా భయపడేది లేదు... పులివెందుల సహా స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వీప్ చేయబోతున్నాం..' అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ధీమా వ్యక్తంచేశారు. పోలీసులు పూర్తి స్వేచ్ఛతో విధులు నిర్వర్తిస్తున్నారని స్పష్టం చేశారు. ఒకవైపు ఈడీ దాడులు, మరోవైపు వైఎస్ వివేకా హత్య కేసు వేళ్లన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపుతుండడంతో జగన్ లో ఆందోళన మొదలైందన్నారు. త్వరలో వైసీపీ క్లోజ్ అవ్వడం ఖాయమని మంత్రి సవిత తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా నామినేషన్ల ప్రారంభమైన మొదటిరోజే గొడ్డలి పార్టీ నాయకులు పెట్రేగిపోయారన్నారు. పక్కరాష్ట్రాల నుంచి గూండాలను తీసుకొచ్చి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారన్నారు. తిరుపతి, రాయచోటి, పుంగనూరు, ధర్మవరంతో పాటు పలు చోట్ల వైసీపీ కార్యకర్తలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు.

వీధి రౌడీలా ఎంపీ మిధున్ రెడ్డి...

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి ఖాయమని తేలిపోవడంతో వైసీపీ నాయకులు విచక్షణ మరిచిపోయి, దాడులకు తెరతీశారని మంత్రి సవిత మండిపడ్డారు. ఎంపీ మిధున్ రెడ్డి వీధి రౌడీలా ప్రవర్తిస్తూ...నామినేషన్ కేంద్రంలో టీడీపీ కార్యకర్తలపై దాడులకు దిగారన్నారు. వైసీపీ దౌర్జన్యాలపై తమ నాయకులు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. దాడులకు తెగబడిన వారిపై చర్యలకు చట్టపరంగా ముందకెళ్తామన్నారు. - మిగతా3లో



నిశ్శబ్ద నీడలో తాడిపత్రి..!!

....రణరంగాన్ని తలపించే తాడిపత్రిలో..

నామినేషన్ల వేళ అనూహ్య నిశ్శబ్దం!

....సవాళ్లు లేవు.. ప్రతి సవాళ్లు లేవు.. హడావుడి అసలే లేదు!

....పోలీసుల పకడ్బందీ బందోబస్తు ప్రభావమా?లి

....తెరవెనుక రాజకీయ వ్యూహాలేనా?లి

తాడిపత్రి, అక్టోబర్ 17 (సాయంత్రం):

ఎన్నికలంటేనే రాజకీయ వేడి.. అందులోనూ తాడిపత్రి రాజకీయాలంటే ప్రత్యేక చర్చ! ప్రత్యర్థుల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు.. మాటల తూటాలు.. అనుచరుల హడావుడి.. వీధివీధినా రాజకీయ సందడి! గతంలో ఎన్నికల వేళ కనిపించే ఈ వాతావరణానికి భిన్నంగా ప్రస్తుతం తాడిపత్రిలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రశాంతంగా సాగుతుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

రణరంగం ఎక్కడ.. ఈ నిశ్శబ్దం ఏమిటి?

సాధారణంగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందంటే చాలు.. తాడిపత్రిలో రాజకీయ సందడి మొదలవుతుంది. ప్రత్యర్థి పార్టీల నాయకుల మధ్య మాటల యుద్ధం, భారీ ర్యాలీలు, నినాదాలు, అనుచరుల హడావుడితో ఎన్నికల వాతావరణం వేడెక్కుతుంది. అయితే ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సమయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. రెండో రోజు కూడా నామినేషన్ల ప్రక్రియ ఎలాంటి బహిరంగ ఘర్షణలు లేకుండా ప్రశాంతంగా కొనసాగడం స్థానికంగా చర్చనీయాంశమైంది. నామినేషన్ కేంద్రానికి వస్తున్న అభ్యర్థులు తమ పత్రాలను సమర్పించి తిరిగి వెళుండగా, గత ఎన్నికల సమయంలో కనిపించే హడావుడి ఈసారి పెద్దగా కనిపించడం లేదు. ఐనామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగడానికి పోలీసుల పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు ఒక కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లో బందోబస్తు, సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా, అవసరమైన చోట్ల పోలీసు పికెటింగ్, ముందస్తు భద్రతా చర్యలు వంటి అంశాలు - మిగతా3లో

టెన్షన్ లేని ఎలక్షన్ జరగాలి..!!

....కొత్తచెర్వు మండలంలో ఎంపీటీసీ , జడ్పీటీసీ ఎన్నికల ఏర్పాట్లు మరియు కేంద్రాల పరిశీలన.

....జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

కొత్తచెర్వు, అక్టోబర్ 17: సీమ వార్త సాయంత్రం.

శనివారం మధ్యాహ్నం శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కొత్తచెర్వు మండలంలోని ఎంపీటీసీ మరియు జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపీటీసీ /జడ్పీటీసీ - 2026 నిబంధనల ప్రకారం స్ట్రాంగ్ రూమ్‌లు మరియు కౌంటింగ్ కేంద్రాల వివరాలతో కూడిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. కొత్తచెర్వులోని ప్రధాన కేంద్రమైన అప్పన్నగారి అక్కమ్మ శ్రీరామప్ప మెమోరియల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల" వద్ద ఎన్నికల నిర్వహణకు సంబంధించిన భద్రత మరియు సౌకర్యాలను జిల్లా కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా మరియు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అధికారులకు కలెక్టర్ కీలక ఆదేశాలుఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రశాంతంగా, పారదర్శకంగా మరియు నిష్పాక్షికంగా జరిగేలా అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు.ఓటర్లకు గానీ, పోలింగ్ సిబ్బందికి గానీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు జరగకుండా కఠిన నిఘా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వెంకట సుబ్బయ్య,తహసీల్దార్,ఎంపీడిఓ,ఎంఇఓ,పిఆర్ ఎస్ఇ మురళి తధితరులు పాల్గొన్నారు.

రొద్దం పీఠంపై... లీడర్స్‌లో టెన్షన్ టెన్షన్..!!

....రొద్దం ఎంపీపీ, జడ్పీటీసీ రిజర్వేషన్లతో కుర్చీ కోసం ఉత్కంఠ.

....ఆశావహుల్లో జోరందుకున్న పోటీ – టికెట్ల కోసం అధిష్టానం వైపు చూపు

రొద్దం, అక్టోబర్ 17 (సీమవార్త) సాయంత్రం.

రొద్దం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జరగనున్న తొలి స్థానిక ఎన్నికలు కావడంతో అన్ని పార్టీలూ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్లపై గెజిట్ విడుదల చేయడంతో ఆశావహులు తమ రిజర్వేషన్లను చూసుకుని టికెట్ల కోసం అధిష్టానం వైపు చూస్తున్నారు.

రిజర్వేషన్‌తో మారిన సమీకరణాలు:

ఎంపీపీ, జడ్పీటీసీకి ఏ రిజర్వేషన్ వస్తుందోనని ఎదురుచూసిన ఆశావహుల్లో రిజర్వేషన్ ప్రకటనతో చర్చ మొదలైంది. జడ్పీటీసీ ఎస్సీకి రిజర్వ్ కావడంతో బీసీ వర్గానికి చెందిన పలువురు ఆశావహులు ఇప్పుడు ఎంపీపీ పీఠంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

జడ్పీటీసీ ఓసీకి వస్తుందని భావించిన నేతలకు అది ఎస్సీకి రావడంతో కొంత నిరుత్సాహం నెలకొనగా, దళిత వర్గంలో కొత్త ఆశలు చిగురించాయి.

కూటమిలో ఆశావహులు:

జడ్పీటీసీ (ఎస్సీ రిజర్వేషన్) కోసం కూటమి నుండి చోలేమర్రికి చెందిన మారెప్ప, రొద్దంకు చెందిన సిద్దన్న, క్రిష్టప్ప, రుద్రప్రసాద్, మోపురపల్లికి చెందిన నింగప్ప, రొప్పాలకు చెందిన పి.ఎం.శంకర్, రొద్దం నరసింహులు తదితరులు టికెట్ - మిగతా3లో



సీమ వార్త సాయంకాలం
శనివారం 17
అక్టోబర్ 2026

చెయ్యి చెయ్యి కలిపితే... సీట్లు అన్నీ మనవే ..!!





....పెనుకొండలో మున్సిపల్ ఎన్నికలపై మంత్రి సవితమ్మ సమీక్ష సమావేశం

....చైర్మన్‌తో పాటు 23 వార్డుల్లో విజయం సాధించేలా సమష్టిగా పనిచేయాలి:

పెనుకొండలో స్పష్టం చేసిన... మంత్రి సవితమ్మ

పాల్గొన్న....నియోజకవర్గ అబ్జర్వర్ నరసింహారావు.

పెనుకొండ అక్టోబర్ 17 సీమ వార్త సాయంత్రం.

పెనుకొండ క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితమ్మ మున్సిపల్ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పార్టీ శ్రేణుల సమన్వయం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అందరూ కలిసికట్టుగా ముందుకు సాగుతూ, చైర్మన్ స్థానంతో పాటు పెనుకొండ మున్సిపాలిటీలోని 23 వార్డుల్లో విజయం సాధించే లక్ష్యంతో పనిచేయాలని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉంటూ, క్షేత్రస్థాయిలో సమన్వయంతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు, సోమసెట్టి వెంకటేశ్వర్లు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేసవయ్య, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, సీనియర్ నాయకులు మాధవ నాయుడు, నారాయణస్వామి, పెనుకొండ పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, కన్వీనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అనుసరిం చాల్సిన కార్యాచరణ, నాయకులు మరియు కార్యకర్తల బాధ్యతలు, ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు షరతులతో బెయిల్

క్రాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు న్యూఢిల్లీలోని మందిర్ మార్గ్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు శనివారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ. 50,000 వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించిన న్యాయస్థానం, ఆయన విడుదలకు మార్గం సుగమం చేసింది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126, 170 ప్రకారం, ఏడాది పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదన్న షరతుకు ఆయన కట్టుబడి ఉండాల్సి ఉంటుంది. ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో సీజేపీ తలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' నిరసన యాత్రకు ముందు, శుక్రవారం ఢిల్లీ పోలీసులు ఆయనను ముందుజాగ్రత్త చర్యగా అదుపులోకి తీసుకున్నారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126, 170 కింద ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నిరసన యాత్రకు ముందు సుమారు 20 మందికి పైగా పోలీసులు దీప్కే నివాసానికి వెళ్లి ఆయనకు రెండు నోటీసులు అందజేశారు. కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించడం వల్ల తొక్కిసలాట జరిగే అవకాశం ఉందని, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడే ప్రమాదం ఉన్నందున అక్కడ నిరసనలు చేపట్టరాదని ఒక నోటీసులో పేర్కొన్నారు. గతంలో సమర్పించిన బాండ్ షరతులను ఉల్లంఘిస్తున్నారని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జారీ చేసిన రెండో నోటీసులో పోలీసులు హెచ్చరించారు. అక్టోబర్ 10న కూడా దీప్కే, ఆయన సహచరులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు ముందుజాగ్రత్తగా అదుపులోకి తీసుకున్నారు. ఏడాది పాటు శాంతియుతంగా ఉంటామని హామీ ఇస్తూ, ఒక్కొక్కరు రూ. 50,000 పూచీకత్తు సమర్పించి వారు విడుదలయ్యారు. సీజేపీ శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో 'లెహ్రా దో తిరంగా' యాత్రను నిర్వహించాలని నిర్ణయించింది. అయితే, బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నందున, ఢిల్లీ పోలీసులు ఈ యాత్రకు అనుమతి నిరాకరించారు.

విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలి

-మొదటిపేజీ తరువాయి

యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

కేరళ మాజీ సీఎం విజయన్ ఇంటికి నోటీసులు అతికించిన ఈడీ

కేరళ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నేత పినరయి విజయన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్)కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో భాగంగా అక్టోబర్ 23న విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. విజయన్ ఇంట్లో అందుబాటులో లేకపోవడంతో, అధికారులు ఆయన నివాసం గోడకు నోటీసును అంటించారు. ఈరోజు కొచ్చి నుంచి వచ్చిన ఈడీ అధికారులు తిరువనంతపురంలోని బేకరీ జంక్షన్ వద్ద ఉన్న పినరయి విజయన్ నివాసానికి వెళ్లారు. ఆ సమయంలో ఆయన ఇంట్లో లేకపోవడంతో, అక్కడి సిబ్బంది నోటీసులు తీసుకునేందుకు నిరాకరించారు. దీంతో, అధికారులు ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ) కింద జారీ చేసిన సమన్లను ఇంటి ప్రవేశ ద్వారం వద్ద అతికించి వెళ్లారు. విజయన్ కుమార్తె వీణకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ అనే కంపెనీకి ఐటీ సేవల పేరుతో సీఎంఆర్ఎల్ సుమారు రూ. 2.78 కోట్లు అక్రమంగా చెల్లించిందనే ఆరోపణలపై ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే విజయన్‌ను విచారించాలని నిర్ణయించింది. అయితే, ఈడీ చర్యను సీపీఎం సీనియర్ నేత వి. శివన్‌కుట్టి తప్పుపట్టారు. విజయన్ కన్నూర్‌లో పార్టీ సమావేశంలో ఉన్నారని, ఆయన పరారీలో లేరని స్పష్టం చేశారు. ఆచూకీ లేనప్పుడు నోటీసులు అంటించడం చట్ట ప్రకారం సరైనదే అయినా, ఆయన ఎక్కడ ఉన్నారో స్పష్టంగా తెలిసినప్పుడు ఈ విధానం సరికాదని ఆయన విమర్శించారు.

దళితులు, గరిజనులు, మైనార్టీలే 'సర్' అసలైన లక్ష్యం

ఏఐసీసీ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కి గౌడ్ కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను అక్రమంగా తొలగించారని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... తొలగించిన ఓట్లలో ఎక్కువ శాతం దళితులు, ఆదివాసీలు, మైనారిటీ వర్గాలకు చెందినవే ఉన్నాయని అన్నారు. 2014లో నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని, దాని పరిరక్షణ కోసమే 2017లో రాహుల్ గాంధీ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ పోరాటం కాంగ్రెస్ భవిష్యత్తు కోసం కాదని, దేశ ప్రజల భవిష్యత్తు కోసమని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ చేస్తున్న ఈ ఆరోపణలను భారత ఎన్నికల సంఘం గతంలోనే ఖండించింది. 13 కోట్ల ఓట్లను తొలగించారనడం అవాస్తవమని, ముసాయిదా జాబితాల రూపకల్పన సమయంలో 'నివాసం లేనివారు, చిరునామా మారినవారు, మరణించినవారు, డూప్లికేట్' కేటగిరీ కింద గుర్తించిన వారి సంఖ్య మాత్రమే అదని ఈసీ అక్టోబర్ 2న ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ ఫెలోషిప్ ద్వారా మొదటి బ్యాచ్‌లో 50 మందికి, రెండో బ్యాచ్‌లో 100 మంది నిపుణులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు.

బీజేపీకి నచ్చని ఓట్లను తొలగిస్తున్నారు..

-మొదటిపేజీ తరువాయి

స్వతంత్రతపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియలో చేసిన మార్పులపైనా మహేశ్ గౌడ్ ప్రశ్నలు లేవనెత్తారు. సీఈసీ ఎంపిక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తొలగించారని కేంద్రాన్ని ప్రశ్నించారు. స్వతంత్ర సంస్థల విధుల్లో కేంద్రం జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని హెచ్చరించారు.

అన్ని చోట్ల టీడీపీ గూండాలు బరితెగిస్తున్నారు

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం ఆర్గనైజ్డ్ క్రైమ్‌కు పాల్పడుతోందని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియలో అరాచకాలకు పాల్పడుతున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. అన్ని చోట్ల టీడీపీ గూండాలు బరి తెగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని చోట??ల అధికారులు నామినేషన్ల పత్రాలు తీసుకోవడం లేదు. పుంగనూరు, రాయచోటిలో అరాచకాలకు పాల్పడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా జరిగే పరిస్థితి లేదన్నారు.

మహిళలకు, యువతకు ప్రాధాన్యత

-మొదటిపేజీ తరువాయి

చేసింది. క్షేత్రస్థాయిలో పార్టీ అభిప్రాయాలు, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అభ్యర్థులను ముందుగానే ప్రకటించడం ద్వారా వారికి ప్రచారానికి తగినంత సమయం ఇవ్వడంతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు టీడీపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ రెండు జాబితాలతో కలిపి టీడీపీ ఇప్పటివరకు మొత్తం 58 స్థానాలకు తమ అభ్యర్థులను ప్రకటించినట్లయింది.

ఖరారైన అభ్యర్థుల పూర్తి జాబితా:

మున్సిపల్ కార్పొరేషన్ (1):

మచిలీపట్నం: షేక్ అబ్దుల్ అబిదా

మున్సిపాలిటీలు మరియు నగర పంచాయతీలు (21):

ఆకివీడు: నిలోఫర్ షేక్

బేతంచెర్ల: ఐ. లోకేశ్ గౌడ్

చీరాల: యెరిచర్ల హనీ స్పందన

బుచ్చిరెడ్డిపాలెం: దొడ్ల విజయలక్ష్మి

డోన్: కోట్ల సుజాతమ్మ

గుత్తి: గోవిందరాజులు తమిళ్ సెల్వి

గుంతకల్లు: యశోద

జంగారెడ్డిగూడెం: రొంగల అనుష

కదిరి: షేక్ సమీరా

కళ్యాణదుర్గం: బుట్ట లక్ష్మి

కొండపల్లి: కన్నెకంటి అమూల్య

కొవ్వూరు: జొన్నలగడ్డ రాధారాణి

నాయుడుపేట: షకీరా

నందిగామ: శాకమూరి వంశీధర్

నందికొట్కూరు: ఈ.ఎం. సబురున్నిసా

నర్సీపట్నం: చింతకాయల పద్మావతి

ప్రొద్దుటూరు: నంద్యాల రాఘవరెడ్డి

వెంకటగిరి: దొంతు శారద

ఉయ్యూరు: చేదుర్తిపాటి ప్రవీణ్ కుమార్

ఏలేశ్వరం: యార్లగడ్డ అక్షిత

ఎమ్మిగనూరు: మాచాని సునీత

ఈ జాబితాలో మహిళలకు, యువతకు ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మున్సిపాలిటీలకు అభ్యర్థులను ప్రకటించడం ద్వారా అన్ని ప్రాంతాల్లో ఎన్నికలకు సిద్ధమవుతున్నామనే సంకేతాలను పార్టీ పంపింది. మిగిలిన స్థానాలకు కూడా త్వరలోనే అభ్యర్థులను ఖరారు చేసి, పూర్తిస్థాయిలో ఎన్నికల ప్రచారంలోకి దిగాలని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది.

తిరువూరు కూటమిలో చిచ్చు..

పురపాలక ఎన్నికల వేళ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో అధికార ఎన్డీయే కూటమిలో రాజకీయ ఉద్రిక్తత రాజుకుంది. తిరువూరు మున్సిపల్ ఛైర్మన్ స్థానాన్ని పొత్తులో భాగంగా జనసేన పార్టీకి కేటాయించడాన్ని స్థానిక టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అధిష్ఠానం నిర్ణయాన్ని ధిక్కరించి, ఆయన తిరుగుబాటు జెండా ఎగరేశారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య సీట్ల సర్దుబాటు జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం, తిరువూరు మున్సిపల్ ఛైర్మన్ పదవిని జనసేనకు కేటాయించారు. దీంతో జనసేన పార్టీ తమ అభ్యర్థిగా మాధవి పేరును ప్రకటించింది. అయితే, ఈ నిర్ణయాన్ని ఎమ్మెల్యే శ్రీనివాసరావు వ్యతిరేకించారు. టీడీపీ తరఫున నాగలక్ష్మి శ్రావణిని ఛైర్మన్ అభ్యర్థిగా బరిలోకి దింపుతున్నామంటూ ఆయన తన మద్దతు ప్రకటించారు. రేపు శ్రావణి నామినేషన్ దాఖలు చేస్తారని ఎమ్మెల్యే కొలికిపూడి సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ అనూహ్య పరిణామంతో తిరువూరులోని మిత్రపక్షాల మధ్య తీవ్ర గందరగోళం, అసంతృప్తి నెలకొంది. పొత్తు ధర్మానికి విరుద్ధంగా సొంత పార్టీ ఎమ్మెల్యేనే రెబల్ అభ్యర్థిని నిలబెట్టడం కూటమిలో చర్చనీయాంశంగా మారింది. నామినేషన్ల గడువు సమీపిస్తుండటంతో ఈ వివాదం ఎలాంటి మలుపు తీసుకుంటుందోనని సర్వత్ర ఆసక్తి నెలకొంది.

ఓటమి భయంతోనే దాడులు..!!

-మొదటిపేజీ తరువాయి

పోలీసులు పూర్తి స్వేచ్ఛతో విధులు నిర్వర్తిస్తున్నారన్నారని మంత్రి సవిత స్పష్టంచేశారు.

వైసీపీ పని క్లోజ్...

గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు ఎలా వ్యవహరించారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని మంత్రి సవిత తెలిపారు. వారిలా తమ పార్టీ నాయకులు నామినేషన్లు చించలేదని, బెదిరింపులకు, దౌర్జన్యాలకు పాల్పడడం లేదని తెలిపారు.ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగాలన్నది తమ అభిమతమన్నారు. ఒకవైపు ఈడీ వరుస దాడులు, మరోవైపు వైఎస్ వివేకా హత్య కేసులో వేళ్లన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్నాయని, ప్యాలెస్ పెద్దలు విలవిలలాడుతున్నారని మంత్రి సవిత తెలిపారు. దీంతో ఏం చేయాలో పాలుపోక, జగన్ రెడ్డి రాష్ట్రంలో విధ్వంసాలకు తెరతీశారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలని చూస్తుంటే. ఆయన మాత్రం శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ పని ముగిసిందని, త్వరలో ఆ పార్టీ క్లోజ్ అవ్వబోతోందని మంత్రి సవిత తెలిపారు.

'స్థానికం'లో క్లీన్ స్వీప్ చేస్తున్నాం...

యిదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు దోపిడీ, దౌర్జన్యాలతో కాలం గడిపారని, వారికి ఓటు అడిగే హక్కు కూడా లేదని మంత్రి సవిత అన్నారు. పులివెందుల సహా అన్నీ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి పార్టీలు క్లీన్ స్వీప్ చేయబోతున్నాయని ధీమా వ్యక్తంచేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, అభ్యర్థి ఎవరైనా విజయానికి కృషి చేయాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

నిశ్శబ్ద నీడలో తాడిపత్రి..!!

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికల వాతావరణంపై ప్రభావం చూపుతున్నాయనే చర్చ సాగుతోంది.

అయితే ఈ ప్రశాంతతకు పోలీసుల బందోబస్తే ఏకైక కారణమని నిర్ధారించే పరిస్థితి లేదు. ఎన్నికల నిబంధనలు, అధికారుల పర్యవేక్షణ, అభ్యర్థుల వ్యూహాలు కూడా ఇందుకు కారణమై ఉండవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు.


తెరవెనుక వ్యూహాల వేగం.. పైకి మాత్రం ప్రశాంతం!

బహిరంగంగా రాజకీయ హడావుడి కనిపించకపోయినా, అభ్యర్థులు తమదైన వ్యూహాలతో ముందుకు సాగుతున్నట్లు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వార్డుల వారీగా అభ్యర్థుల ఎంపిక, మద్దతుదారుల సమీకరణ, సాధ్యాసాధ్యాలపై చర్చలు, పొత్తులు లేదా రాజీ ప్రయత్నాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే బెదిరింపులు, కవింపు చర్యలు లేదా ఇతర ఒత్తిళ్లు జరుగుతున్నాయనే ప్రచారానికి సంబంధించి స్వతంత్రంగా నిర్ధారించిన ఆధారాలు అందుబాటులో లేవు. దీంతో ప్రస్తుతం కనిపిస్తున్న ప్రశాంతత వెనుక అసలు రాజకీయ పరిస్థితి ఏమిటన్నది వేచి చూడాల్సిన అంశంగా మారింది.

ప్రశాంతత కొనసాగుతుందా? ఉత్కంఠకు తెరపడేదెప్పుడు?

తాడిపత్రి రాజకీయాల్లో ప్రస్తుతం కనిపిస్తున్న ఈ నిశ్శబ్దం ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు కొనసాగుతుందా? నామినేషన్ల చివరి రోజుల్లో రాజకీయ సందడి పెరుగుతుందా? అభ్యర్థుల మధ్య పోటీ ఏ రూపం తీసుకుంటుంది? అన్న ప్రశ్నలు స్థానికంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మొత్తానికి, గతంలో ఎన్నికల వేళ రాజకీయ వేడితో వార్తల్లో నిలిచే తాడిపత్రి.. ఈసారి నామినేషన్ల ప్రారంభ దశలో ప్రశాంత వాతావరణంతో చర్చలోకి వచ్చింది. ఈ ప్రశాంతతకు కారణాలేమిటన్నది స్పష్టంగా తెలియాలంటే రానున్న పరిణామాలను నిశితంగా గమనించాల్సిందే. రణరంగాన్ని తలపించే తాడిపత్రిలో ఈ నిశ్శబ్దం సాధారణ ప్రశాంతతేనా? లేక ఎన్నికల వ్యూహాల్లో భాగమా? సమాధానం రానున్న రోజుల్లో తేలనుంది!

రొద్దం పీఠంపై... లీడర్స్‌లో టెన్షన్ టెన్షన్..!!



-మొదటిపేజీ తరువాయి

ఆశిస్తున్నట్లు తెలుస్తున్నది.

ఎంపీపీ పీఠానికి కూటమి నుండి ఎం.నరహరి, పాత్రపల్లి నరసింహులు, టైలర్ ఆంజనేయులు, కంబాలపల్లి మంజునాథ్, రొద్దంకు చెందిన అశ్వత్ నారాయణ తదితరులు పేర్లు వినిపిస్తున్నాయి.మరోవైపు ఎంపీ పార్థసారథి వర్గంలో ఎంపీపీకి రొప్పాల నుండి జి.రాము, సానిపల్లి నుండి సూరి, నారనాగేపల్లి నుండి నాగభూషణం, కోగిర నుండి సూరి, తురకలపట్నం నుండి నాగేంద్ర తదితరులు ఆశావహులుగా ఉన్నారు.

వైసీపీలో పరిస్థితి:

వైసీపీ తరఫున జడ్పీటీసీకి కలిపి గ్రామానికి చెందిన నాగేంద్ర పేరు దాదాపుగా ఖరారైనట్లు సమాచారం. అయితే కోగిర గంగాధర్, దొడగట్ట గోపాల్, రొద్దం సినిమా నారాయణప్ప, కంచి సముద్రం చిన్నా, చిన్నమంతూరు రమణ, దందేపల్లి తిమ్మయ్య తదితరుల వారు కూడా టికెట్లు ఆశిస్తున్నట్లు సమాచారం.

క్లీన్ స్వీప్ లక్ష్యం:

గత ఎన్నికల్లో టీడీపీ పోటీకి దూరంగా ఉండటంతో 15 ఎంపీటీసీలు, ఒక జడ్పీటీసీని వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. కానీ ఈసారి మాత్రం కూటమి (టీడీపీ, బీజేపీ, జనసేన) 15 ఎంపీటీసీలు, ఒక జడ్పీటీసీని క్లీన్ స్వీప్ చేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకుంది. పెనుకొండ ఎమ్మెల్యే, మంత్రి సవిత ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.

ఇప్పటికే కూటమిలో దాదాపు 13 మంది తమ బయోడేటాలను పెనుకొండ కూటమి పార్టీ కార్యాలయంలో అందజేసినట్లు తెలుస్తోంది. ఇందులో రొప్పాల గ్రామానికి చెందిన మాల మహానాడు సామాజిక వర్గానికి చెందిన శంకర్ కూడా ఉన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా పార్టీ కోసం కష్టపడ్డానని, ఎస్సీలలో తమ వర్గానికి ఇప్పటివరకు వార్డు మెంబర్ పదవి కూడా రాలేదని, ఈసారి తమకు అవకాశం ఇవ్వాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు.

తెలంగాణకు నేటి నుంచి వర్ష సూచన..

-మొదటిపేజీ తరువాయి



తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. రేపు (అక్టోబర్ 18) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

సీమ వార్త సాయంకాలం

శనివారం 17
అక్టోబర్ 2026

సమాజాన్ని మార్చడానికి... ఓటే ఆయుధం.

ఓటు విలువ తెలుసుకోండి.. వినియోగించుకొని హక్కు సాధించండి.

చెన్నేకొత్తపల్లి అక్టోబర్ 17 (సీమ వార్త): సాయంత్రం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు శ్రీ సత్యసాయి జిల్లాలోని రాప్తాడు నియోజక వర్గ పరిధిలోని చెన్నేకొత్తపల్లి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు ప్రజాస్వామ్య అవగాహన అవసరం ఎంతైనా వున్నది. చెన్నేకొత్తపల్లి మండలంలోని ఓటర్లు తమ ఓటు విలువను గుర్తించి, స్వేచ్ఛగా, విజ్ఞతతో ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన కోసం జరిగే ఎన్నికల్లో ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా తమ నిర్ణయం తీసుకోవాలి.



ఓటరు మహాశయులారా.. మీ ఓటు ఐదేళ్ల భవిష్యత్తుకు పునాది!

కులం పేరుతో, మతం పేరుతో ఓట్లు అడిగే వారి మాటలకు ప్రభావితం కాకుండా, మద్యం అలాగే చర్చి, మసీదు, దేవాలయాల అభివృద్ధి కొరకు అలాగే ఇతరత్రా వాటికి డబ్బు ఆశ చూపే ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలి. అలాగే వారసత్వ రాజకీయాల ప్రభావానికి లోనుకాకుండా, అభ్యర్థుల వ్యక్తిత్వం, ప్రజాసేవ, నిజాయితీ, బాధ్యతాయుతమైన పనితీరు, గ్రామాభివృద్ధిపై వారి ఆలోచనలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి.

ఓటరు ఆలోచించాల్సిన ముఖ్యమైన ప్రశ్నలు!

మన గ్రామంలో తాగునీరు, రహదారులు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎవరు ప్రాధాన్యత ఇస్తారు? గ్రామంలోని పేదలు, రైతులు, మహిళలు, యువత, అణగారిన వర్గాల సమస్యలను ఎవరు బాధ్యతగా పరిష్కరించగలరు? ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామసభల్లో ప్రజల అభిప్రాయాలకు విలువనిచ్చే నాయకుడు ఎవరు? ఎన్నికల సమయంలోనే కాకుండా, ఎన్నికల తర్వాత కూడా ప్రజలకు సేవ చేయడానికి ఎవరు సిద్ధంగా ఉన్నారు? గ్రామ పంచాయతీ నిధులను పారదర్శకంగా వినియోగించి, గ్రామాభివృద్ధికి కృషి చేయగల నాయకుడు ఎవరు? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఆలోచించిన తర్వాతే ఓటరు తన నిర్ణయం తీసుకోవాలి. ఓటు అమ్ముకోవడం అంటే మన హక్కును మనమే బలహీనపరచుకోవడం ఎన్నికల సమయంలో ఇచ్చే కొద్దిపాటి డబ్బు, మద్యం లేదా ఇతర తాత్కాలిక ప్రలోభాల కోసం ఓటు హక్కును వదులుకోవడం వల్ల దీర్ఘకాలంలో గ్రామాభివృద్ధికి నష్టం కలగవచ్చు. ఓటు అనేది కేవలం ఒక గుర్తుకు వేసే ముద్ర మాత్రమే కాదు. అది మన గ్రామ భవిష్యత్తును నిర్ణయించడంలో ప్రజలకు లభించిన రాజ్యాంగబద్ధమైన హక్కు. వారసత్వ రాజకీయాలు ఉన్నాయనే ఒక్క కారణంతో ఏ అభ్యర్థినీ ముందుగానే తిరస్కరించకుండా, ప్రతి అభ్యర్థి ప్రజాసేవా రికార్డు, సామర్థ్యం, నిజాయితీ, అభివృద్ధి ప్రణాళికలను పరిశీలించి ఓటర్లు తమ నిర్ణయం తీసుకోవాలి.

యువత ముందుకు రావాలి!

చెన్నేకొత్తపల్లి మండలంలోని యువత, విద్యావంతులు, ప్రజాస్వామ్యంపై అవగాహన కలిగిన పౌరులు ఓటు విలువపై ప్రజల్లో చైతన్యం కల్పించాలి. కుల, మత విభేదాలకు అతీతంగా గ్రామ ఐక్యతను కాపాడుతూ, ప్రశాంతమైన ఎన్నికలకు సహకరించాలి.

ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకూ విలువ ఉంది. ఓటు హక్కును బాధ్యతతో వినియోగించుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యం.

ఓటరు మహాశయులారా.. మీ ఓటు మీ హక్కు.. మీ ఓటు మీ బాధ్యత.. మీ ఓటు మీ గ్రామ భవిష్యత్తు!

ప్రలోభాలకు దూరంగా ఉండండి.. ప్రజాస్వామ్య విలువలను కాపాడండి.. అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వండి!.చెన్నేకొత్తపల్లి మండలంలోని 15 గ్రామ పంచాయితీ సర్పంచి పదవులకు, అలాగే 13 మంది ఎంపీటీసీ పదవులకు అలాగే జడ్ పి టి సి, అలాగే ఎం.పి.పి పదవులకు ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఓటరు గుర్తింపు కలిగిన ప్రతి ఒక్కరూ తమ విలువైన ఓటును స్వార్థ పరులకు, దౌర్జన్యాలు చేసేవారికి, రౌడీ షీటర్ లకు, నెర స్వభావాలు కలిగియున్నవారికి, భయ భ్రాంతులకు గురి చేసేవారికి,ప్రభుత్వ నిధులను ప్రజలకు చెందకుండా అభివృద్ధి ముసుగులో తమ స్వార్థంతో ధన సంపాదనే ధ్యేయంగా నడుచుకుంటారు అనే సందేహం వస్తె అటువంటి వారికి ఓటును వేయకండి. ఐదు సంవత్సరాల కాలం పాటు గ్రామ పంచాయితీ పరిధిలోని గ్రామాల అభివృద్ధి, మండల అభివృద్ధి,విద్య, వైద్య, కు ప్రథమ స్థానం ఇచ్చేవారికి, గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించే వారికి, అలాగే ప్రజలకు అందుబాటులో వుండి నిస్వార్థంగా ప్రజలకు సేవచేసేవారిని ఎన్నుకోవాలి.పదవుల దాహంతో ఎంతో మంది వస్తారు, కానీ వారి ప్రవర్తన, మాట తీరు, ప్రజలలో వారికి వున్నవిలువ, ఎటువంటి మనస్తత్వము కలిగియున్న వారు, విద్యావంతులు, జ్ఞాన వంతులు, ప్రజల సంక్షేమం కోసం పాటుపడేవారిని గుర్తించి ఓటును వేయండి.రాజకీయ పార్టీల నాయకుల చేతులలో రబ్బరు స్టాంపు లాంటివారికి ఓటు వేసి, నష్టపోకుండా ప్రజలు చూసుకోవాలి.

తాడిపత్రి చైర్మన్ పీఠం..
వైసీపీ అభ్యర్థిగా ఫయాజ్ బాషా ఖరారు!

టీడీపీలో వీడని సస్పెన్స్.. రేపే నామినేషన్లకు ఆఖరి గడువు!

వెంకటరమణ సహా ముగ్గురి పేర్లపై చర్చ.. చివరి నిమిషంలో ఎవరికి దక్కనుంది అవకాశం?

తాడిపత్రి, అక్టోబర్ 17 సాయంత్రం (సీమ వార్త): తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ పీఠంపై రాజకీయ ఉత్కంఠ రోజురోజుకూ పెరుగుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) తన చైర్మన్ అభ్యర్థిగా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఫయాజ్ బాషా పేరును ఖరారు చేయగా, అధికార తెలుగుదేశం పార్టీ (టీడీపీ) మాత్రం ఇంకా తన అభ్యర్థిని ప్రకటించకపోవడం స్థానిక రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. నామినేషన్లకు రేపే చివరి రోజు కావడంతో టీడీపీ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఫయాజ్ బాషా పేరును వైసీపీ అధిష్ఠానం ఖరారు చేసింది. దీంతో ఆ పార్టీ శ్రేణులు నామినేషన్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. వైసీపీ అభ్యర్థి పేరు స్పష్టమవడంతో ఇప్పుడు అందరి దృష్టి టీడీపీ నిర్ణయంపైనే పడింది.

టీడీపీలో ముగ్గురి పేర్లు.. ఎవరికి దక్కనుంది పీఠం?

మరోవైపు అధికార టీడీపీలో చైర్మన్ అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఆశావహుల సంఖ్య, సామాజిక సమీకరణాలు, పార్టీ అధిష్ఠానం నిర్ణయం వంటి అంశాలు



అభ్యర్థి ఎంపికలో కీలకంగా మారినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు, గతంలో మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన వెంకటరమణతో పాటు, ఆయనకు చెందిన సామాజిక వర్గానికి చెందిన ఒక ఎన్నారై, పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన మరో వ్యాపారవేత్త పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ముగ్గురిలో ఎవరికి అవకాశం దక్కనుందనే దానిపై ఇప్పటివరకు అధికారిక స్పష్టత లేదు. పార్టీ అధిష్ఠానం చివరకు ఎవరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

రేపే ఆఖరి రోజు.. చివరి గంటల్లో కీలక నిర్ణయమా?

మున్సిపల్ వార్డుల నామినేషన్ల ప్రక్రియ దాదాపు పూర్తయిన నేపథ్యంలో, చైర్మన్ అభ్యర్థి నామినేషన్‌కు రేపే చివరి రోజు కావడం రాజకీయ వేడిని మరింత పెంచుతోంది. అభ్యర్థి ఎంపికలో జాప్యం కొనసాగితే ఆశావహుల్లో అసంతృప్తి తలెత్తే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. టీడీపీ నాయకత్వం చివరి నిమిషంలో అభ్యర్థిని ప్రకటిస్తుందా? లేక ముందుగానే నిర్ణయం వెల్లడించి ఉత్కంఠకు తెరదించుతుందా? అన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

తాడిపత్రి రాజకీయాల్లో మరో 24 గంటలే కీలకం!

ఒకవైపు వైసీపీ అభ్యర్థి ఖరారు కాగా, మరోవైపు టీడీపీ అభ్యర్థిపై సస్పెన్స్ కొనసాగుతుండటంతో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ పీఠం చుట్టూ రాజకీయ చర్చలు వేడెక్కాయి.వైసీపీ నుంచి ఫయాజ్ బాషా.. టీడీపీ నుంచి ఎవరన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న!

మరో 24 గంటల్లో టీడీపీ అభ్యర్థి పేరు వెల్లడయ్యే అవకాశం ఉండటంతో తాడిపత్రి రాజకీయాల్లో తదుపరి పరిణామాలపై ఉత్కంఠ నెలకొంది.

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు

...భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నాగెల్ల రాజు విజ్ఞప్తి

హిరేహాల్, అక్టోబర్ 17 (సీమవార్త సాయంకాలం): డి హిరేహాల్ మండల కేంద్రం లోని శ్రీ శివలింగ స్వామి మఠంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆర్య వైశ్య సంఘం చైర్మన్ నాగెళ్ల రాజు తెలిపారు. ఈ సందర్భంగా మఠంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీ శివలింగ స్వామి మఠానికి విచ్చేసే భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని కోరారు.




43వ వార్డుకు మాజీ కౌన్సిలర్ విజయకుమార్ నామినేషన్

తాడిపత్రి, అక్టోబర్ 17 సాయంకాలం: తాడిపత్రి మున్సిపల్ ఎన్నికల్లో 43వ వార్డు నుండి మాజీ కౌన్సిలర్ విజయకుమార్ శనివారం తన నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అనంతరం విజయకుమార్ మాట్లాడుతూ.. గతంలో కౌన్సిలర్ గా ఉన్న సమయంలో వార్డులో అనేక అభివృద్ధి పనులు చేశానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించానని తెలిపారు. మరోసారి అవకాశం ఇస్తే 43వ వార్డును మరింత అభివృద్ధి చేస్తానని, డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



శరన్నవరాత్రులలోభాగంగా
ఏడవ రోజు సరస్వతి దేవి అలంకరణ





యాడికి అక్టోబర్ 17 సీమ వార్త సాయంకాలం యాడికి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శరన్నవరాత్రులలో భాగంగా ఏడవ రోజు సరస్వతీ దేవి అలంకారం యాడికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ప్రతిరోజు లాగానే చోడశోపచారాలన్నీ ఘనంగా నిర్వహించి బింద సేవా కార్యక్రమం అక్షరాభ్యాసం 10 సంవత్సరాల లోపల బాలికలకు కన్యకా పూజ వంటి కార్యక్రమాలు నిర్వహించి నవదుర్గల నాటక ప్రదర్శన శ్రీలక్ష్మి వారి ఆధ్వర్యంలో తొమ్మిది మంది నవదుర్గలు బాలికలు 9 మంది భక్తులు బాలురు ముగ్గురు రాక్షసుల రూపంలో చాలా అద్భుతంగా స్క్రిప్ట్ ను అనుసరిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తూ బాగా చేశారు చిన్నారులకు గంగవరం చంద్రయ్య శెట్టి కుమారుడు రాజా బహుమతులు ప్రధానం చేశాడు అలాగే వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి వన్ గ్రామ్ గోల్డ్ నగలు అందించారు పెద్ద ఎత్తున వచ్చిన భక్తాదులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు

గోరంట్ల జడ్పిటిసి స్థానాన్ని వడ్డెర్లకు కేటాయించాలి.

వడ్డే నాగేంద్ర కుటుంబానికి జడ్పిటిసి స్థానాన్ని కేటాయించాలి.

టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి కి వినతి పత్రం అందించిన గోరంట్ల మండల వడ్డెర్లు.



గోరంట్ల, అక్టోబర్ 17: సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండల జడ్పిటిసి స్థానాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెర సామాజిక వర్గానికి కేటాయించాలని కోరుతూ గోరంట్ల మండల వడ్డెర సంఘం నాయకులు మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి కి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం గోరంట్ల మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వడ్డెర సంఘం మండల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గోరంట్ల మండలంలో వడ్డెర్ల జనాభా గణనీయంగా ఉందని, అయినప్పటికీ గతంలో ఎప్పుడూ తమ సామాజిక వర్గానికి జడ్పిటిసి స్థాయిలో రాజకీయ ప్రాతినిధ్యం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వడ్డెర కుటుంబాలు వందల సంఖ్యలో ఉన్నాయని, వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న తమను రాజకీయంగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.రానున్న జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో గోరంట్ల జడ్పిటిసి స్థానాన్ని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు వడ్డే నాగేంద్ర కుటుంబానికి కేటాయించాలని మంత్రివర్యులు సవితమ్మ కి మరియు పార్టీ అధిష్టానానికి సిఫార్సు చేయాలని మండల కన్వీనర్ ను మరియు రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్, మాజీ సర్పంచ్ ఉత్తమ్ రెడ్డి మరియు గోరంట్ల మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులను కోరారు. తమకు అవకాశం ఇస్తే పార్టీ విజయం కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గోరంట్ల మండల వడ్డెర సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, సింగల్ విండో అధ్యక్షులు రవి మోహన్, మాజీ సర్పంచులు నిడిమామిడి, బాలకృష్ణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అమర్, రంగయ్య, రామంజి, రఘునాథ్, రమణ, వెంకటేష్, రామచంద్ర, సోము, శేషు మరియు కుల పెద్దలు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్ల అలంకరణలో మారెమ్మ.

....శ్రీ లక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ మారెమ్మ దేవి

....భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. భక్తులకు అన్నదానం.





గోరంట్ల అక్టోబర్ 17 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లిలో వెలసిన శ్రీ మారెమ్మ దేవాలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బి. దేవిరాజు స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ లక్ష్మీదేవి అలంకరణలో శ్రీ మారెమ్మ దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించడంతో ఆలయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గుమ్మయ్యగారిపల్లికి చెందిన నాగమల్లేశ్వరి, రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలను శ్రీ మారెమ్మ దేవి ట్రస్ట్ తరఫున డాక్టర్ బి. దేవిరాజు స్వామి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా ఆలయంలో భక్తి వాతావరణం నెలకొంది.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881